క్లుప్తంగా

జీవామృతం తయారీపై అవగాహన



ఓలేరు(భట్టిప్రోలు): ఓలేరు పంచాయతీ పరిధిలో పురుగు మందు రహిత జీవామృతం తయారీ విధానంపై శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఓలేరు క్లస్టర్ ఇన్‌చార్జి మేరుగ ప్రమీలారాణి ఆధ్వర్యంలో రసాయనాలు, ద్రావణాల తయారీని వివరించారు. 100 లీటర్ల నియమాస్త్రం, 20 లీటర్ల అజ్ఞాస్త్రం, 20 లీటర్ల బ్రహ్మాస్త్రం ద్రవ జీవామృతాలను మహిళలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి శేషగిరి, యూనిట్ ఇన్‌చార్జ్ శివనాగేశ్వరరావు, ఎంసీఏ దోవా ఝాన్సీరాణి, మహిళా సంఘం సభ్యులు, లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం



రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెం పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొనే ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొనాలని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి



బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో ప్రయాణించాలన్నా.. ప్రతి ఒక్కరూ ఉన్నతమైన జీవనం కొనసాగించాలన్నా ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఉండాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ముందుకు సాగాలంటే సంపూర్ణ అక్షరాస్యత అవసరమన్నారు. కళాశాల డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య డి.నిరంజన్ బాబు మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలన మన అందరి ధ్యేయమన్నారు. అనంతరం కళాశాల దత్తత తీసుకున్న ఆసోదివారిపాలెం, వెస్ట్ బాపట్ల, మురుకొండపాడు గ్రామాల్లో విద్య ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కళాశాల విద్యార్థులు, ఆసోదివారిపాలెం గ్రామ కార్యదర్శి కె.సిద్దార్థ, వెస్ట్ బాపట్ల గ్రామ కార్యదర్శి సీహెచ్ రవికృష్ణ, మురుకొండపాడు గ్రామ కార్యదర్శి జె.పవన్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్స్ కె.రాజేంద్ర, వై.శృతి పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక వైద్య శిబిరం



వేమూరు: జ్వరాల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి ఎస్ వెంకట లక్ష్మీ తెలిపారు. మండల కేంద్రంలో జ్వరాల నివారణకు శుక్ర వారం ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. గ్రామంలో విషజ్వరాల విజృంభణపై వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ సిబ్బంది తమ దృష్టి తీసుకొని రావడంతో.. వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మలేరియా అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి కె.పున్నా రెడ్డి, హెల్త్ సూపర్ వైజరు మోర్ల శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో 5వ రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం



భట్టిప్రోలులో సంక్షేమ లబ్ధిని తెలుసుకుంటున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలులో 5వ రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలు, అధికారులు, సచివాలయ సిబ్బంది సకాలంలో సహకరిస్తున్నారో లేదా..? అని విచారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పేదల్లో ఆత్మ విశ్వాసం రెట్టింపు అయ్యిందని మంత్రి మేరుగ పేర్కొన్నారు. గ్రామాల ప్రజలకు పార్టీ, కుల, మత, వర్గ విభేదం లేకుండా సంక్షేమ పథకాలు అందించడం తమ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందన్నారు. ప్రజలకు ఏఏ పథకాలు అందలేదో తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో విసిగి వేసారిపోయిన పేద ప్రజలు సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందుతున్న సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్సు గల్లంతవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మండల జేఏసీ కన్వీనర్ పీఏసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, ఎంపీటీసీలు గద్దె సుశీల, డొక్కు నాగకుమారి, మాజీ ఎంపీపీ కొతరపు విజయలక్ష్మి, బందారు శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పార్టీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వేల్పూరి చిన్నారి, తలకొల యలమంద, దావూరి నాగమల్లేశ్వరరావు, వేల్పూరి నాగేశ్వరరావు, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, ఈవోపీ ఆర్డీ బి. ఊహారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

భట్టిప్రోలు: భట్టిప్రోలు-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొని, ఇంటింటికి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వేమూరు, బలిజేపల్లి, వరహాపురం, బూతుమల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని సబ్ ఇంజినీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కర్లపాలెం: నల్లమోతువారిపాలెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని యువకులు మేళతాళాలతో స్వామివారి విగ్రహాలను వీధులలో ఊరేగింపు చేసి, ఉత్సాహంగా ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయం వద్ద భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

నేడు సదస్సును జయప్రదం చేయండి

రేపల్లె రూరల్: ఎస్సీ, ఎస్టీ రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం విజయవాడ లయోలా కళాశాల ఆడిటోరియంలో శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్ రాంజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయా లని పేర్కొన్నారు.

11న బాలికలకు క్రీడా పోటీలు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని కేర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో ఈ నెల 11న అండర్-14, 17 బాలికల విభాగంలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల క్రీడా కో-ఆర్డినేటర్ మేడిశెట్టి ప్రశాంత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు సంబంధిత పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రంతో నమోదు చేసుకోవాలని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీ బాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'మైనర్' బైక్ దొంగల అరెస్ట్

పిట్టలవానిపాలెం: ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఇద్దరు మైనర్‌లను చందోలు పోలీసులు శుక్రవారం అరెస్టుచేసి, కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. చందోలు స్టేషన్ పరిధిలో తరచుగా ద్విచక్ర వాహనాలు చోరీ జరుగుతన్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఇద్దరు మైనర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా వారి నుంచి 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



అడ్డేపల్లి అడెమ్మ వారు



ప్రత్యేక అలంకరణలో భట్టిప్రోలు దండి పార్వతీదేవి



ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ



రజత వస్త్రాలంకరణలో స్వరాజ్యలక్ష్మి అమ్మవారు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామదేవత దండి పార్వతీ అమ్మవారికి శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్‌లతో భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. స్థానిక విశలేశ్వరనగర్ రామ మందిరంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భట్టిప్రోలు శ్మశానవాటికలో గుండిపార్వతి, వెల్లటూరు లాకు సెంటర్‌లోని కనకదుర్గ మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో కనకదుర్గ అమ్మవార్లు ప్రత్యేక అలంకరనలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నెల రోజులు నిత్యం లక్ష కుంకుమార్చన నిర్వహిలచినట్లు నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని తెలిపారు. దండిపార్వతి అమ్మవారికి సామూహిక పూజలు నిర్వహించారు. యాదవ, కాపు, గౌడ, పద్మశాలీయ, వైశ్య, రజక, వడ్డెర, నాయిబ్రాహ్మణ వివిధ సంఘీయులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా అమ్మవార్లకు జాతర నిర్వహించడం ఆచారమని చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

రేపల్లె: పవిత్ర శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని గ్రామ దేవత బూరుగులమ్మ వారి ఆలయంలో అర్చకుడు నంది వెలుగు భాను సుధాకర్ గురుకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. జీడి, బాదం, పిస్తా పప్పు, ఎండు ద్రాక్ష, దానిమ్మ గింజలతో చేసిన చీరతో ప్రత్యేక అలంకరణ గావించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, పువ్వులు, నూతన వస్త్రాలతో కూడిన సారెను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు, మహిళలకు గాజులు పంపిణీ చేశారు. రైలుపేటలోని శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో స్వరాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించి, రజత వస్త్రాలంకరణ, వెండి పువ్వులతో అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

సామూహిక వరలక్ష్మి వ్రతం

కర్లపాలెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం చేశారు. వాసవి క్లబ్, వాసవీ క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి పంచామృతాలతో, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు తూనుగుంట్ల లక్ష్మణకుమార్, క్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలు యక్కల నాగశ్వేత, సభ్యులు అనిత, రాజేశ్వరి, లక్ష్మీ అనూష, విజయ లక్ష్మి ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు



నూతన పింఛను పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి

కర్లపాలెం: అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి అన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజతో కలసి అందజేశారు. గ్రామ పంచాయతీల వారీగా కొత్తగా మంజూరైన పింఛన్ల నగదును లబ్ధిదారులకు సంబంధిత సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్ బేగ్, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, హైమావతి, సాంబశివరావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను

నిజాంపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తుందని ఉప సర్పంచ్ మోపిదేవి మార్కండేయులు అన్నారు. నిజాంపట్నంలోని సచివాలయం-3, 4లో నూతనంగా మంజూరైన 54 వైఎస్సార్ పింఛను కానుకలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ నాజర్‌ఖాన్, అక్కరాజు, పండు, పంచాయితీ సెక్రటరీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: రాజకీయాలకు, వర్గ భేదాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పొన్నపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. స్థానిక నాయకులు ఎంపీ మోపిదేవికి ఘన స్వాగతం పలికారు. గ్రామ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పింఛను సక్రమంగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. ఏదైన సాంకేతిక లోపంతో పథకాలు దూరమైతే అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీ మోపిదేవి అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా ఉంటూ అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన వాటా కల్పించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేస్తూ ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. సంక్షమ పథకాలు మరింత మందికి అందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, సర్పంచ్ పైనం బసవ పున్నమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ చేసేది హైటెక్ పాదయాత్ర

చెరుకుపల్లి: ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నారా చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పొన్నపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పొన్నపల్లి గ్రామ ప్రజలకు జగనన్న ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా రూ.12కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రజలకు ఇంత మంచి జరుగుతుంటే చంద్రబాబు రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని, అధికారం దక్కించుకునేందుకు తండ్రీకొడుకులు హైటెక్ పాదయాత్రలు ప్రారంభించి, ప్రజల కష్టాలు తెలుసుకోకుండా విహార యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల పుంగనూరులో అశాంతి వాతావరణం సృష్టించి, పోలీసులపై దాడికి తెగబడి దుర్మార్గమైన పాదయాత్రలు చేస్తూ.. గొడవలు రెచ్చగొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కి భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు. టీడీపీ పార్టీ అధికారంలోకి రావటం అసంభవం అని జోస్యం చెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



నిల్వ చేరిన మురుగు నీరును పరిశీలిస్తున్న ఆర్డీఓ

భట్టిప్రోలు: వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. ఆయన శుక్రవారం భట్టిప్రోలు విచ్చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయ సమీపంలోని ఆయుర్వేద వైద్యశాల వెనుక బజారును పరిశీలించారు. వర్షం, మురుగు నీరు పారుదల లేకపోవడం, నీరు నిల్వ చేరి దుర్వాసన వస్తుండటంతో పంచాయతీ అధికారులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం కల్పించాలని చెప్పారు. గ్రామంలో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, బ్లీచింగ్, సున్నం చల్లించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, పోతురాజు తదితరులు ఉన్నారు.

కమనీయం మురళీకృష్ణుని కల్యాణం



రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణుడు

రేపల్లె: శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని రైలుపేట పట్టాభిరామస్వామి ఆలయంలో శుక్రవారం మురళీకృష్ణుడి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేరులు రుక్మిణీ, సత్యభామలతో పాటు మురళీకృష్ణుడికి వేదమంత్రాల నడుమ మంగళ స్నానాలు చేయించి, వధూవరులుగా పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. వేదమండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తటవర్తి విజయ్‌కుమార్, రాధికారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుపడింది..



గతంలో గుంతలమయంగా ఉన్న రోడ్డు



రోడ్డుపై గుంతలు పూడ్చిన తర్వాత

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్లుగా రహదారిపై గుంత ఏర్పడి కొద్దిపాటి వర్షం కురిసినా చిన్నపాటి చెరువును తలపిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారింది. వైఎస్సార్ సీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి నిజాంపట్నం వెళ్తుండగా రోడ్డుపై గుంతల విషయం ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మరమ్మతులు నిర్వహించాలని కోరారు. తక్షణమే స్పందించిన అధికారులు శుక్రవారం రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్పించారు.

దుకాణాల్లో వరుస చోరీలు



వస్త్ర దుకాణంలో పరిశీలిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రజాక్

రేపల్లె రూరల్: పట్టణ ప్రధాన రహదారిలో రెండు దుకాణాలలో దొంగలు స్వైరవిహారం చేశారు. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. గురువారం రాత్రి కృష్ణా టాకీసు సెంటరులోని మాజేటి కోటేశ్వరరావుకు చెందిన దుకాణం, సమీపంలోని వైష్ణవీ ఫ్యాన్సీ షాప్ తాళాలు పగలగొట్టి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. కోటేశ్వరరావుకు దుకాణంలో రూ.10 వేలు, వైష్ణవి ఫ్యాన్సీ షాప్‌లో రూ.9వేల నగదును తీసుకెళ్లినట్లు ఆయా దుకాణాల యజమానులు పేర్కొన్నారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.